

# పాపులర్ రచనలు చేయటం ఎలా?

యండమూరి వీరేంద్రనాథ్



(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

## *సినిమా రచన*

సినిమాకి రచయిత అవసరం నాలుగు రకాలుగా ఉంటుంది.

1. మూలకథ
2. కథా విస్తరణ
3. స్క్రీన్ ప్లే
4. మాటలు

ఇది కాక ఇంకా గేయరచన కూడా రచయితదే

సాధారణంగా ఒక నిర్మాత, దర్శకుడు కలిసి చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నప్పుడు తాము ఏ రకమైన చిత్రాన్ని తీయాలనుకుంటున్నారో స్థూలంగా ఊహిస్తారు. క్రైమ్, ప్రేమ, ఆర్ట్ ఫిల్మ్, సెమీ ఆర్ట్ ఫిల్మ్ - ఈ రకంగా విభజన జరుగుతుంది. పెద్ద పెద్ద కమర్షియల్ డైరెక్టర్లందరూ కొద్దిగా ప్రేమ, రొమాన్స్ వయోలెన్స్, సెంటిమెంట్, కుటుంబ కథ మొదలైనవన్నీ కొద్ది కొద్ది పాళ్ళలో మిళితం చేసి వ్రాసిన కథలకి ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు.

### *మూలకథ*

మూల కథని సాధారణంగా దర్శకుడు రచయితకి చెబుతాడు. `జగదేకవీరుడు - అతిలోక సుందరి` అన్న కథ ప్రారంభించినప్పుడు, ఒక దేవకన్య కొన్ని అనివార్య పరిస్థితిలో భూలోకానికి రావటం మూల కథగా వ్రాస్తే బావుంటుంది - అన్న నిర్ణయానికి దర్శకుడు వచ్చాడు. దీనిమీద కథా విస్తరణ కార్యక్రమం మొదలైంది.

### *కథా విస్తరణ*

ఒక దేవకన్య భూలోకానికి వస్తుంది కాబట్టి, భూలోకంలో ఉండే దౌర్జన్యాలూ, ఇక్కడ ఉండే మనుషుల్లో మంచితనం - అవన్నీ హీరో దేవకన్యకి చూపిస్తాడు. కాబట్టి హీరో పాత్రని గైడ్‌గా ఉంచితే బావుంటుంది అన్న నిర్ణయానికి రావటం జరిగింది. హీరో బ్యాచిలర్ కాబట్టి, హీరోయిన్ దేవకన్య కాబట్టి హీరో వెంట నలుగురైదుగురు పిల్లలు ఉంటే కొంత కుటుంబ వాతావరణం అందులో కనిపిస్తుందనీ, కొన్ని సెంటిమెంట్లకి వీలవుతుందని భావించటం జరిగింది.

ఈ రకంగా కథా విస్తరణ కార్యక్రమం జరుగుతుంది.

ఎవరయినా ఒక రచయిత తను సినిమాకి సరిపోయే కథ ఏదయినా వ్రాశాను అనుకుంటే అన్నిటికన్నా కష్టమయిన పని ఆ కథని నిర్మాతకి గానీ, దర్శకుడికి గానీ చెప్పటం. ప్రస్తుత పరిస్థితుల్లో వారిద్దరూ చాలా బిజీగా ఉంటారు. కాబట్టే వాళ్ళవరకూ కథలు

తీసికెళ్ళటమే కష్టమవుతోంది. అదీగాక దాదాపు ప్రతీరోజు నలుగురైదుగురు రచయితలు దర్శకుడిని కలిసి తన కథలు వినమని దర్శకుడిని అభ్యర్థిస్తూ ఉంటారు. ఇందువల్ల దర్శకుడు వీలైనంతవరకూ వాళ్ళ బారినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

ఇందులో అన్నిటికన్నా ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే, దాదాపు వెయ్యిమంది వర్ధమాన రచయితలు ఈ రకంగా సినిమా కథలు వ్రాస్తే, అందులో ఒకటి కూడా దర్శకుడికిగానీ, నిర్మాతకి గానీ నచ్చదు. ఇందులో విచిత్రమేమీ లేదు. ఈ విషయమై వర్ధమాన రచయితలతో చర్చిస్తే, "ఇప్పుడొస్తున్న సినిమా కథలన్నీ ఈ రకంగానే ఉంటున్నాయి కదండీ! మా కథని ఎందుకు తీసుకోరు?" అని తిరిగి ప్రశ్నిస్తూ ఉంటారు.

ఇప్పుడొస్తున్న సినిమాలు ఏ రకంగా ఉన్నాయో, ఆ రకంగానే వ్రాస్తే, దానికోసం ఆ నిర్మాత ఒక వర్ధమాన రచయితకి డబ్బులిచ్చి ఆ కథని కొనుక్కోవటం ఏం అవసరం?. ఏదయినా క్రొత్తదనం ఉంటేనే దర్శకుడికిగానీ, నిర్మాతకి గానీ ఉత్సాహం ఉంటుంది.

క్రొత్తదనం అంటే హీరోకి ఆరుగురు భార్యలుండటం, లేదా విలన్ చివరలో హీరోని చంపేయటం కాదు. ధీరోదాత్తత ఉంటూనే సినిమాకి కావలసిన పరిధిలో ఆ మసాలాలన్నీ పెట్టి, క్రొత్తరకంగా సృష్టిస్తేనే అది దర్శకుడికిగానీ, నిర్మాతకి గానీ నచ్చుతుంది.

హీరో హీరోయిన్ని కలుసుకోవటం అనేది ప్రతీ సినిమాలో తప్పని సరి. ఎంత క్రొత్త రకంగా కలుసుకుంటారు? ఎంత క్రొత్త రకంగా ప్రేమించుకుంటారు అని మాత్రమే రచయిత ఆలోచించాలి. అలాగే హీరో విలన్ల మధ్య మొట్టమొదటిసారి పరిచయం ఎంత చిత్రంగా, ఒళ్ళు గగుర్పొడిచేలా. ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకునేలా ఉండాలి అనేది మాత్రమే రచయితలు ఆలోచించాలి.

కథ ఆలోచించేటప్పుడు ఈ కథ ఏ హీరోకి సరిపోతుందని దర్శకుడు ఊహిస్తాడు. ప్రస్తుత పరిస్థితిలో ముందు హీరోల దగ్గర్నుంచి కాల్షీట్స్ తీసుకున్న తరువాత, ఆ విలన్ హీరోని చచ్చేటట్టు బాదుతాడు అని వ్రాస్తే దర్శకుడికి నచ్చదు. అక్కడ హీరో చిరంజీవి కాకుండా, ఒక సామాన్యమైన నటుడయితే బావుంటుందేమో కానీ, చిరంజీవికి ఉన్న ఇమేజ్‌కి ఆ రకమైన ఎత్తుగడ బావోదు.

అదే రకంగా చిరంజీవి అప్పుడే ఇంటర్మీడియట్ పాసయ్యాడు అని కానీ, అక్కినేని నాగేశ్వరరావుగారు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని కాలేజీలోంచి బయటికి వస్తుండగా టైటిల్స్ వేస్తామని చెపితే బావోదు. ఈ రకమైన జాగ్రత్తలన్నీ వర్ధమాన రచయితలు తీసుకోవాలి.

దర్శకుడిగానీ, నిర్మాతగానీ డైరెక్ట్‌గా కలుసుకోకుండా అసిస్టెంట్ డైరెక్టర్‌లకి ముందు కథ చెప్పి వారి ద్వారా దర్శకుడిని కన్విన్స్ చేయటం మంచి పద్ధతి. నిర్మాతలకి తెలిసిన వారెవరి చేతయినా, ఆ కథని చదివించి, వారి ద్వారా నిర్మాత దగ్గర అపాయింట్ మెంట్ తీసుకుని, అప్పుడు కథ చెప్పటం కూడా ఒక రకంగా మంచిదే. వీటన్నిటికన్నా ముందు ఆలోచించవలసినదేమిటంటే తాము వ్రాసిన కథ అద్భుతమనీ, అది సినిమా తీస్తే వంద రోజులు ఆడటం తప్పదన్న అభిప్రాయాన్ని రచయితలు ముందు వదులుకోవాలి. ఈ పుస్తకంలో ఇంతకు ముందే చెప్పినట్టు కాకి పిల్ల కాకికి ముద్దు కానీ బయట వాళ్ళకి అది నచ్చదు.

రచయిత తన కథని వ్రాత రూపేణా తీసికెళ్ళి చూపించడం కంటే, నోటితో చెప్పడం మంచిది. ఈ రకంగా చెప్పేటప్పుడు కథని వీలయినంత కుప్తంగా, తను గొప్పగా ఉన్నాయి అనుకున్న స్మఘటనలని వివరంగా చెప్పటం మంచిది.

నిర్మాత, దర్శకుల యొక్క సమయం చాలా విలువయింది. వీటిల్ని వీలయినంతలో ఉపయోగించుకుంటూ కుప్తంగా చెప్పి, కన్విన్స్ చేయాలి. ఒకసారి నిర్మాతకి గానీ, దర్శకుడికిగానీ పాయింట్ నచ్చితే, వాళ్ళే గంటల తరబడి కూర్చుని ఆ కథని వినటానికి ఉత్సాహం చూపిస్తారు. ఈ పాయింట్ మాత్రం ప్రతీ వర్ధమాన రచయిత గుర్తుంచుకోవాలి.

స్టూడియోలకి వెళ్ళి, నిర్మాతల ఇంటి ముందు స్క్రిప్ట్‌తో నిలబడి, వారియొక్క అపాయింట్ మెంట్ కోసం వేచివుండటం ఎప్పుడూ మంచిది కాదు. ఎందుకంటే ఇలా చేసేవాళ్ళు కోకొల్లలు. ఏ నిర్మాతా తన సమయాన్ని వృధా పరచుకుని వీళ్ళ కథలన్నీ వింటూ కూర్చోడు. ముందు ఆ పరిధిలో మనకు తెలిసిన వాళ్ళను అప్రోచ్ చేసి, వాళ్ళ ద్వారా పెద్దవాళ్ళని కలుసుకోవటం మంచిది.

ఒక కథ నిర్మాతకి నచ్చిన తరవాత ఫీల్డ్‌లో ఉన్న మరికొంత మంది అనుభవజ్ఞులైన రచయితల్ని చర్చలకి పిలవటం జరుగుతుంది. వర్ధమాన రచయిత ఎంత గొప్పగా కథ వ్రాసినా, కొన్ని సినిమాటిక్ మలుపులు, సంఘటనలు తప్పనిసరి. దీనికి అనుభవం అవసరం. అందువల్ల మిగతా రచయితలతో కలిసి కూర్చున్నప్పుడు, వారు ఏ విధంగా ఆలోచిస్తారు? ఏ విధంగా దీన్ని సినిమాటిక్‌గా మారుస్తారు అనేది గమనిస్తూ ఉండాలి. చాలామంది రచయితలకి, ముఖ్యంగా సినిమా ఫీల్డ్‌తో పరిచయం లేని రచయితలకి ఈ రంగం అంటే చాలా చిన్నచూపు ఉంటుంది. ఏదన్నా మార్పు సూచిస్తే అది నచ్చదు. వీరందరికీ ఉన్న ఏకైక అభిప్రాయం ఏమిటంటే, 'ఇప్పుడొస్తున్న చెత్త సినిమాలకన్నా మా కథ బావుందికదా!' అన్నది. ఈ నెగిటివ్ ఆలోచన నుంచి బయటపడితే తప్ప రచయిత పైకి రాలేడు.

చాలామంది పాఠకులు నా నవలలని సినిమాగా మార్చినప్పుడు, సినిమా – నవలంత బాగాలేదు అనటం గమనిస్తూ ఉంటాను. నవల యధాతథంగా తీస్తే అదెప్పుడూ సినిమాగా రాణించదు. సినిమా అనగానే హీరో బేస్‌డ్ అయితే, దానిపరంగా కథని మార్చుకోవాలి. ఒక్కోసారి కథకన్యాయం జరగవచ్చు కూడా. కానీ, సినిమా వేరు. నవల వేరు. నవలలు సినిమాగా మార్చినప్పుడు కేవలం నవలలో ఉండే పాత్రలని సినిమాకు తీసుకోవడం జరుగుతుంది తప్ప, కథకి ఎక్కువ ప్రాముఖ్యత ఉండదు. అది సినిమాకి అనుగుణంగా మార్చబడుతూ ఉంటుంది.

వర్ధమాన రచయితలు సీరియల్స్ వ్రాసేటప్పుడు సినిమాని దృష్టిలో పెట్టుకుని వ్రాయటం మంచి పద్ధతి కాదు. ఆ విధంగా నేను వ్రాసిన ఆఖరి పోరాటం, రుద్రనేత్ర, స్టూవర్ట్ పురం పోలీస్ స్టేషన్ మొదలైనవన్నీ సీరియల్స్‌గానూ, నవలలుగానూ ఫెయిలయిన విషయం పాఠకులు గమనించే ఉంటారు. నవలలో ఏదన్నా మంచి పాయింట్ ఉండి, అది దర్శకుడికి నచ్చితే దాన్ని సినిమాకి అనుగుణంగా మారుస్తాడే తప్ప, కేవలం సినిమాలనే దృష్టిలో పెట్టుకుని రచించటం అభిలషణీయం కాదు.

వచ్చే సంచికలో.. స్క్రీన్‌ప్లే